# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ డిసెంబర్ 03 మంగళవారం 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 129

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## ‘ఛలో ఢిల్లీ’కి కదం తొక్కిన రైతులు

**నోయిడా వద్ద అడ్డుకున్న పోలీసులు ఢిల్లీ-నోయిడా రహదారిపై నిలిచిన రాకపోకలు**

న్యూఢిల్లీ: పంటలకు మద్దతు ధర పెంచాలంటూ పంజాబ్ రైతులు నేడు ‘ఛలో ఢిల్లీ’ కార్యాచరణకు కదం తొక్కారు. అయితే, నోయిడాలోని దళిత్ ప్రేరణ్ స్థల్ వద్ద పంజాబ్ రైతులను పోలీసులు అడ్డుకున్నారు. బారికేడ్లు ఏర్పాటు చేసి వందలాది రైతులు ముందుకు రాకుండా పోలీసులు నిలువరించారు. అయినప్పటికీ బారికేడ్లు తొలగించి ఢిల్లీ వైపు దూసుకెళ్లేందుకు రైతులు ప్రయత్నించారు. రైతుల ఛలో ఢిల్లీ నేపథ్యంలో మూడంచెల భద్రత చర్యలు అమలు చేసిన పోలీసులు... రైతులు ముందుకు సాగకుండా ఆపేశారు. పోలీసులు భారీగా వాటర్ క్యానన్లు, టియర్ గ్యాస్ షెల్స్ సిద్ధంగా ఉంచారు. అదనపు బలగాలను మోహరించి, డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేశారు. రైతుల ఆందోళన కారణంగా ఢిల్లీ-నోయిడా రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి.

# ప్రభుత్వాన్ని బద్నాం చేసే వారికి ప్రజలే బుద్ధి చెప్పాలి

హైదరాబాద్:ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా సోమవారం హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో అంబులెన్స్‌లను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో దానం నాగేందర్, భట్టి విక్రమార్క, దామోదర్ రాజనర్సింహ, షబ్బీర్ అలీ, పొన్నం ప్రభాకర్, కె.కేశవరావువరి వేస్తే ఉరేసుకున్నట్లేనని గత పాలకులు చెప్పారు. తెలంగాణ సోన సన్నాలు పండిస్తే బోనస్ ఇస్తామని చెప్పా. ఈ వానాకాలం 1.53 కోట్ల టన్నుల ధాన్యం పండింది. కొనుగోలు చేసిన 5 రోజుల్లోనే ఖాతాల్లో బోనస్ డబ్బులు వేస్తున్నాం. ‘రైతుబంధు ఇస్తే భూమి ఉన్న వారికే పోతుంది.. సన్నధాన్యం పండించడంతో ఎకరానికి రూ.15 వేల బోనస్ వచ్చింది’ అని ఈ మధ్య నాతో ఓ మహిళా కౌలురైతు తెలిపారు. అలా చెబుతుంటే నాకు బిర్యానీ తిన్నంత సంతోషంగా అనిపించింది. ఈ ప్రభుత్వం మరో పదేళ్లు ఉంటుంది. రైతులు సన్నధాన్యం పండిం చాలని కోరుతున్నా. హైదరాబాద్ సంస్థానం భారత్‌లో విలీనమైన 1948 నుంచి నేటి వరకు... దేశంలోని ఏ రాష్ట్ర ప్రభుత్వానికి కూడా అధికారంలోకి వచ్చిన తొలి సంవత్సరంలోనే 50 వేల ఉద్యోగాలను భర్తీ చేసిన చరిత్ర లేదు. అయితే, తెలంగాణలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మొదటి ఏడాదిలోనే ఏకంగా 50 వేల మందికి నియామకపత్రాలను అందించి సరికొత్త



**విద్య, వైద్య రంగాలకే మా మొదటి ప్రాధాన్యం**

**ఉద్యోగాల భర్తీలో దేశంలోనే రికార్డు సృష్టించాం**

**పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళన**

**మా పనితీరుకు గీటు రాయి**

**వైద్యారోగ్య శాఖ విజయోత్సవ సభలో సీఎం రేవంత్‌రెడ్డి**

రికార్డును సృష్టించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన పది నెలల్లోనే అద్భుతాలేమీ చేయలేదంటూ భాజపా, భారాసలు బద్నాం చేస్తున్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. కేంద్రంలో పదేళ్లు పాలించి మూడోసారి కుర్చీలో కూర్చున్న మోదీతోపాటు రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన కేసీఆర్ కూడా రైతులకు చేసిందేమీ లేదని, అలాంటి వారిప్పుడు కాంగ్రెస్ సర్కారుపై చేస్తున్న విష ప్రచారాన్ని తిప్పి కొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్ నెక్లెస్‌రోడ్డులోని హెచ్ఎండీఏ మైదానంలో నిర్వహించిన వైద్యారోగ్య శాఖ ప్రజాపాలన విజయోత్సవాల్లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ‘ఒకాయన దిల్లీలో మూడోసారి అధికారంలోకి వచ్చిన వ్యక్తి. రైతుల ఆదాయం రెండింతలు చేస్తానని చెప్పి... రైతు వ్యతిరేక నల్లచట్టాలు తెచ్చారు. దీనిపై దిల్లీ సరిహద్దుల్లో రైతులు యుద్ధం ప్రకటించారు. 750 మంది చనిపోతే చట్టాలను వెనక్కి తీసుకొని, రైతు జాతికే క్షమాపణ చెప్పారు.

## మాట మార్చడంతో సీఎం రేవంత్‌రెడ్డి పీహెచ్‌డీ

**ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా.. ఇప్పుడు ఒకలా రేవంత్**

**రెండు నాల్కల ఆణిముత్యాల విడుదల**

**రైతుబంధు ఇస్తామని ఎగ్గొట్టాడు : మాజీ మంత్రి హరీశ్‌రావు**



**హైదరాబాద్:** పూటకో మాట మాట్లాడడం.. మాట మార్చడంలో సీఎం రేవంత్ రెడ్డి పీహెచ్‌డీ పూర్తి చేశారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సెటైర్లు వేశారు. రేవంత్ ఏడాది పాలన పూర్తవుతున్న సందర్భంగా రేవంత్ రెండు నాల్కల ఆణిముత్యాలను తెలంగాణ భవన్ వేదికగా హరీశ్‌రావు విడుదల చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రైతుబంధు, బతుకమ్మ చీరలు, ఎల్ఆర్ఎస్, పోటీ పరీక్షల వాయిదా, కులగణన సర్వే, కూల్చివేతలు, ఏక్ పోలీసు, మద్యం అమ్మకాలు, కాళేశ్వరం ప్రాజెక్టు, సోనియా గాంధీ బలిదేవత, పార్టీ ఫిరాయింపులు, శిలాఫలకాలు, పేపర్ యాడ్స్, మూసీ అభివృద్ధి, అడ్వైజర్లకు కేబినెట్ హోదా, యూట్యూబ్ చానెల్స్, ప్రజాస్వామ్య పునరుద్ధరణ, బూటకపు ఎన్‌కౌంటర్లపై రేవంత్ రెడ్డి మాట్లాడిన డబుల్ స్టాండర్డ్స్‌ను హరీశ్‌రావు వీడియో ఆధారాలతో ప్రజలకు చూపించారు. పై అంశాలపై ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఏం మాట్లాడిండు.. అధికారంలోకి వచ్చాక ఏం మాట్లాడిండు అనే విషయాలను కళ్లకు కట్టినట్లు తెలిపారు హరీశ్‌రావు. కేసీఆర్ రెండు పంటలకే రైతుబంధు ఇస్తున్నాడు.. మేం అధికారంలోకి వస్తే మూడు పంటలకు రైతుబంధు ఇస్తామన్న రేవంత్ వ్యాఖ్యలను హరీశ్‌రావు గుర్తు చేశారు. ఇక మంచి డిజైన్లతో ప్రతి ఆడబిడ్డకు రెండు చీరలు పంపిణీ చేస్తామన్న విషయాన్ని కూడా గుర్తు చేశారు హరీశ్‌రావు. ఎల్ఆర్ఎస్ విషయంలో రేవంత్ రెడ్డి మాట మార్చిన తీరును కూడా వివరించారు. ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించి పోటీ పరీక్షల విషయంలో రేవంత్ రెడ్డిది డబుల్ స్టాండ్ కాదు.. ట్రిపుల్ స్టాండ్ అని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. కుల గణన సర్వేపై రేవంత్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఏం మాట్లాడారో విషయాన్ని హరీశ్‌రావు వివరించారు. ఇక కూల్చివేతల విషయానికి వస్తే.. తెలియక, అమాయకంగా కొనుగోలు చేసిన వారి విషయంలో రెగ్యులరైజ్ చేయొచ్చు కదా అని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాట్లాడిండు.. అధికారంలోకి వచ్చాక కూల్చివేతలపై రేవంత్ రెడ్డి మాట మార్చారని హరీశ్‌రావు మండిపడ్డారు.

## నారాయణ కాలేజీలో విద్యార్థి ఆత్మహత్య.

- యాజమాన్యం వేధింపులే కారణం: తల్లిదండ్రులు.

ఘట్కేసర్: పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ నారాయణ కళాశాలలో సోమవారం ఇం టర్ విద్యార్థి బాత్రూంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎంపీసీ గ్రూపు చదువుతున్న భానోత్ తనుష్ నాయక్ (16) సాయంత్రం ప్రాంతంలో బాత్రూంకు వెళ్లి తిరిగి రాలేదు. తోటి విద్యార్థులు వెళ్లి చూడగా తనుష్ బాత్రూంలో ఉరే సుకొని కనిపించాడు. విషయం తెలుసుకున్న






నారాయణ కాలేజీ యాజమాన్యం విద్యార్థిని వెంటనే ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతను చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. అనంతరం కళాశాల యాజమాన్యం విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందించింది. తనుష్ నాయక్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అయితే కళాశాల యాజమాన్యం వేధింపుల వల్లే తమ కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని మృతుని తల్లిదం డ్రులు ఆరోపిస్తున్నారు. కాలేజీ వద్ద ఎలాంటి అవాంఛ నీయ ఘటనా జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

### ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య.

**ప్రగతినగర్‌ఎన్ఎస్ఆర్ ఇంపల్స్ కాలేజీలో ఘటన**

**గోప్యంగా ‘గాంధీ’కి మృతదేహం?**

ప్రగతినగర్: మేడ్చల్ జిల్లా ప్రగతినగర్లోని ఎన్ఎస్ఆర్ ఇంపల్స్ రెసిడెన్షి యల్ కళాశాలకు చెందిన ఇంటర్ విద్యార్థిని సోమవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. నిర్మల్ జిల్లా కదెం గ్రామానికి చెందిన రఘురాం రెడ్డి కూతురు ప్రజ్ఞారెడ్డి ప్రగతినగర్లోని ఎన్ఎస్ఆర్ ఇంపల్స్ రేసిడీన్షియల్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువు తున్నది. ఉదయం 9:30 గంటల ప్రాంతంలో ప్రజ్ఞారెడ్డి హాస్టల్లోని తన గదిలో ఫ్యాన్కు ఉరేసుకుని సూసైడ్ చేసుకున్నది. కాలేజీ యాజమాన్యం విద్యార్థిని మృతి చెందిన విషయాన్ని దాచిపెట్టి మృత దేహాన్ని గుట్టుచప్పుడు కాకుండా గాంధీ ఆస్పత్రికి తరలించినట్టు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## మహిళా కానిస్టేబుల్ దారుణ హత్య





**కారుతో ఢీకొట్టి గొంతుకోసి హతమార్చిన తమ్ముడు**

**రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో ఘటన**

**నెలరోజుల క్రితమే ప్రేమ వివాహం చేసుకున్న నాగమణి**

2లో

## మృత్యువై దూసుకొచ్చిన లారీ

**అదుపుతప్పి దూసుకెళ్లిన లారీ**

**ముగ్గురు చిరు వ్యాపారలు దుర్మరణం**




2లో




## మహిళలు ఏమైనా కుందేళ్లా?

**పిల్లల్ని కంటే ఉద్యోగాలు దొరికే పరిస్థితి కూడా లేదు**

మోహన్ భగవత్ వ్యాఖ్యలపై రేణుకా చౌదరి ఆగ్రహం




## మావోయిస్టుల మృతదేహాలను భద్రపరచండి

**పోలీసులకు హైకోర్టు కీలక ఆదేశాలు**

**ఏటూరునాగారం ఎన్‌కౌంటర్‌పై పూర్తయిన విచారణ**




## ఉపముఖ్యమంత్రి పదవి రేసులో లేను

**షిండే తనయుడు శ్రీకాంత్ షిండే కీలక వ్యాఖ్యలు**

మహాయుతి ప్రభుత్వం కొలువుదీరడానికి ముందు రకరకాల ప్రచారం జరుగుతోందని, కానీ ఆ కథనాలు నిరాధారమైనవన్నారు.



## తుపాకీతో కాల్చుకొని వాజేడు ఎస్ఐ ఆత్మహత్య

ములుగు జిల్లా వాజేడు ఎస్ఐ రుద్రారపు హరీశ్(29) తన సర్వీసు రివాల్వరుతో కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడటం సంచలనంగా మారింది.

వేగుచుక్క

# మావోయిస్టుల మృతదేహాలను భద్రపరచండి

హైదరాబాద్: ఏటూరు నాగారంలో మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. పోలీసులు బూటకపు ఎన్‌కౌంటర్ చేశారని పౌరహక్కుల సంఘం తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. భోజనంలో మత్తుపదార్థాలు కలిపి మావోయిస్టులను కస్టడీలోకి తీసుకున్నారని, చిత్రహింసలకు గురిచేసి కాల్చిచంపారని న్యాయస్థానానికి తెలిపారు. మావోయిస్టుల మృతదేహాలపై తీవ్ర గాయాలు ఉన్నాయని న్యాయవాది కోర్టులో వాదించారు. కనీసం వారి మృతదేహాలను కుటుంబ సభ్యులకు చూపించకుండా పోస్టుమార్టం చేశారన్నారు. ఎన్?హెచ్?ఆర్సీ నిబంధనలకు విరుద్ధంగా మావోయిస్టుల పట్ల పోలీసులు వ్యవహరించారని హైకోర్టుకు తెలిపారు. అనంతరం ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదిస్తూ, పోలీసులు భద్రత దృష్ట్యా మృతదేహాలను ఆసుపత్రికి తరలించామని కోర్టుకు తెలిపారు. కేఎంసీ వైద్య నిపుణుల ఆధ్వర్యంలోనే పోస్టుమార్టం నిర్వహించారని స్పష్టం చేశారు. పోస్టుమార్టం ప్రక్రియను మొత్తం వీడియో తీశారని పేర్కొన్నారు. ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు మావోయిస్టుల మృతదేహాలను భద్రపరచాలని పోలీసులకు ఆదేశాలిచ్చింది. అలాగే మృతదేహాలను కుటుంబ సభ్యులకు, బంధువులకు చూపించాలని తెలిపింది. ఈ విషయంపై తదుపరి విచారణను రేపటికి(03-12-2024)కి హైకోర్టు వాయిదా వేసింది. మావోయిస్టుల ఎన్?కౌంటర్?పై డీజీపీ జితేందర్? రెడ్డి స్పందించారు. మావోయిస్టులపై విషపదార్థాలు ప్రయోగించారనేది దుష్ప్రచారమని అన్నారు. మావోయిస్టులు స్పృహ కోల్పోయాక కాల్పులు జరిపామనడం అవాస్తమని తెలిపారు. వారు అత్యాధునిక ఆయుధాలతో పోలీసులపై కాల్పులు జరిపారని వివరించారు. పెట్రోలింగ్? చేస్తున్న



పోలీసులపై మావోయిస్టులు కాల్పులు జరపడంతో, పోలీసులు ఎదురు తిరిగి కాల్పులు జరపడంతో ఏడుగురు మావోయిస్టులు మరణించారని వెల్లడించారు. హైకోర్టు, ఎన్?హెచ్?ఆర్సీ సూచనల మేరకు శవపరీక్షలు నిర్వహించామని తెలిపారు. ఎన్?కౌంటర్? కేసు దర్యాప్తు అధికారిగా వేరే జిల్లా డీఎస్పీని నియమించినట్లు డీజీపీ జితేందర్? ప్లెస్? నోట్?లో వివరాలు వెల్లడించారు. కాగా ములుగు జిల్లా ఏటూరు నాగారంలో జరిగిన ఎన్‌కౌంటర్?లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ బూటకు ఎన్?కౌంటర్?పై తెలంగాణ హైకోర్టులో పౌరహక్కుల సంఘం లంచ్ మోషన్ పిటిషన్?ను దాఖలు చేసింది. మావోయిస్టుల భోజనంలో విషప్రయోగం జరిగిందని పిటిషన్‌లో పేర్కొంది. దీనిపై న్యాయస్థానం మధ్యాహ్నం విచారణను చేపట్టింది. మృతదేహాలను వైద్య నిపుణుల సమక్షంలో పోస్టుమార్టం జరపాలని పిటిషన్?లో పౌరహక్కుల సంఘం పేర్కొంది. పోస్టుమార్టాన్ని వీడియో ద్వారా రికార్డు చేయాలని సూచించారు. ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో భారీగా పోలీసులు మోహరించారు. మరోవైపు కుర్సం మంగు, అలియాస్ భద్రుపై రూ.20 లక్షల రివార్డు ఉన్నట్లు జిల్లా ఎస్పీ శబరీష్? తెలిపారు. పూలకొమ్మ అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేస్తున్న గ్రౌండ్స్? బలగాలపై మావోయిస్టులు దాడి చేయడంతో ఆత్మ రక్షణ నిమిత్తం కాల్పులు జరిపామని తెలిపారు. మావోయిస్టుల మృతదేహాల తరలింపులో హైడ్రామా చోటుచేసుకుంది. తెల్లవారుజామున ఎన్?కౌంటర్ జరిగినా,

రాత్రి ఏడు గంటల వరకూ మృతదేహాల తరలింపు జరగలేదు. తొలుత ములుగు ఏరియా ఆసుపత్రికి మృతదేహాలను తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. ఫ్రీజర్లను సైతం సిద్ధం చేశారు. ఆఖరి నిమిషంలో రాత్రి పదకొండున్నర గంటల ప్రాంతంలో ఏటూరునాగారం సామాజిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇవాళ ఫోరెన్సిక్ వైద్యులు శవ పరీక్షలు నిర్వహించిన అనంతరం, మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించనున్నారు. వారం రోజుల పాటు పీపుల్స్ గెరిల్లా ఆర్మీ వారోత్సవాలు జరుగుతాయని మావోయిస్టులు ముందే ప్రకటించగా, దానికి ఒకరోజు ముందే ఈ ఘటన జరగడంతో మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ తగిలినట్లైంది. ములుగు ఎన్?కౌంటర్? ఘటనపై తెలంగాణ పౌరహక్కుల సంఘం నేతలు పలు సందేహాలు వెలిబుచ్చుతున్నారు. పోలీసులెవ్వరికీ గాయాలు కాలేదని, అసలు ఎన్?కౌంటర్? జరిగినట్లు లేదని, అన్నంలో విషం పెట్టి, స్పృహ కోల్పోయిన తర్వాత చిత్రహింసలకు గురి చేసి కాల్చి చంపారని సంఘం నేతలు ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్?కౌంటర్?పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, నిపుణులైన వైద్య బృందం పర్యవేక్షణలో వైద్య పరీక్షలు జరగాలని డిమాండ్ చేస్తున్నారు. ఘటనా స్థలం నుంచి ఆయుధాలు, కిట్ బ్యాగులు, మావోయిస్టు విప్లవ సాహిత్యాన్ని స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు.

# బాలినేనికి మంత్రి పదవి..



ఒంగోలు:ప్రకాశం జిల్లా రాజకీయలలో ఆసక్తి కర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. వైసీపీ ఆవిర్భావం నుంచి ఒంగోలుతో పాటుగా ప్రకాశం జిల్లాలో అన్నీ తానై వ్యవహరించిన మాజి మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వైసిపికి గుడ్ బై చెప్పి జనసేనలో చేరారు. ఎన్నికల ముందే బాలినేని సిఎం చంద్రబాబుతో సమావేశం అయినట్లు.. ఆ సమయం లోనే టీడీపీకి రావాలని.. అధికారంలోకి వచ్చిన తరువాత తగిన ప్రాధాన్యత ఉంటుందని చంద్రబాబు హామీ ఇచ్చారని ప్రచారం జరిగింది. తాజాగా బిగ్ టీవీ ఇంటర్వ్యూలో టీడీపీలోకి వస్తే.. చంద్రబాబు మంత్రి పదవి ఆఫర్ చెసినట్లు బాలినేని వెల్లడించారు . అప్పట్లో తనకు లక్ బాగా లేక టీడీపీలోకి వెళ్లలేదని పేర్కొన్నారు.బాలినేని శ్రీనివాసరెడ్డి గత అసెంబ్లీ ఎన్నికలలో ఒంగోలులో వైసిపి నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. బాలినేని ఒంగోలు ఎంపీతో పాటు దర్శి ఎమ్మెల్యే విషయంతో తాను సూచించిన వారికి సీట్లు ఇవ్వాలని పట్టు బట్టారు. కానీ, జగన్ అంగీకరించ లేదు. ఎన్నికల్లో ఓటమి తరువాత ఈవీఎంల పైన బాలినేని కోర్టుకు ఎక్కారు. పార్టీ నుంచి మద్దతు లభించ లేదు. తరువాతి పరిణామాల్లో బాలినేని జనసేనలో చేరారు. జనసేనాని పవన్‌కళ్యాణ్‌తో సత్సంబంధాలు ఉన్న బాలినేని జనసేనలో చేరే సమయంలోనే రాజకీయ భవిష్యత్ పైన హామీ పొందారంట.ఆయనకు ఎమ్మెల్సీ పదవితో పాటుగా ప్రభుత్వంలో కీలక బాధ్యతలు అప్పగిస్తామని డిప్యూటీ సీఎం పవన్ హామీ ఇచ్చారని సమాచారం. అయితే, బాలినేని జనసేనలో ఎంట్రీ సమయం నుంచి ఒంగోలు టీడీపీ నేతలు ఓపెన్ గానే విమ్మలు గుప్పిస్తున్నారు. బాలినేని జనసేన లో చేరినా.. వైసీపీఅధికారంలో ఉన్న సమయంలో చేసిన పనులకు సమాధానం ఇవ్వకుండా వదిలేది లేదని హెచ్చరిస్తున్నారు. జనసేన లోని కొందరు నేతలు సైతం బాలినేనికి దూరంగా ఉంటున్నారు.ఇక వైసీపీ హయాంలో సెకీ ఒప్పందాలు, సోలార్ విద్యుత్తు ఒప్పందాలకు సంబంధించి జగన్‌పై ముప్పేట దాడి జరుగుతుంది. సెకీ ఒప్పందాలు జరిగినప్పుడు బాలినేని శ్రీనివాసరెడ్డి విద్యుత్తు శాఖ మంత్రిగా ఉన్నారు. అప్పటి జగన్ నిర్ణయాలపైన బాలినేని ఇటీవల కీలక వ్యాఖ్యలు చేస్తున్నారు. జగన్ ను ఇరకాటంలోకి నెట్టే విధంగా వ్యవహరిస్తున్నారు.


# ఉపముఖ్యమంత్రి పదవి రేసులో లేను

ముంబై: మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి పదవిపై, కేంద్రమంత్రి పదవిపై ఆపద్ధర్మ సీఎం ఏక్‌నాథ్ షిండే తనయుడు శ్రీకాంత్ షిండే కీలక వ్యాఖ్యలు చేశారు. కొత్తగా ఏర్పడనున్న మహారాష్ట్ర ప్రభుత్వంలో తాను ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నట్లు వార్తలు వస్తున్నాయని, కానీ అందులో ఎలాంటి వాస్తవం లేదన్నారు. మహాయుతి ప్రభుత్వం కొలువుదీరడానికి ముందు రకరకాల ప్రచారం జరుగుతోందని, కానీ ఆ కథనాలు నిరాధారమైనవన్నారు. తన తండ్రి ఏక్‌నాథ్ షిండే అనారోగ్యం కారణంగా విశ్రాంతి తీసుకుంటున్నట్లు చెప్పారు. గత లోక్ సభ ఎన్నికల తర్వాత తనకు కేంద్రమంత్రిగా అవకాశం వచ్చిందని, కానీ పార్టీ కోసం పని చేయాలనే ఉద్దేశంతో తాను ఆ పదవిని నిరాకరించానని అన్నారు.

పదవి కావాలనే కోరిక తనకు లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో ఎలాంటి మంత్రి పదవి రేసులో తాను లేనని స్పష్టం చేశారు. తమ పార్టీ కోసం, అలాగే తన నియోజకవర్గం కోసం పని చేస్తానన్నారు. కొత్త ప్రభుత్వంలో తాను పదవిని చేపడతాననే ప్రచారం ఇప్పటికైనా ఆగిపోతుందని భావిస్తున్నానన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి అద్భుత విజయం సాధించింది. సీఎం పదవి, మంత్రి పదవుల కేటాయింపులకు సంబంధించి చర్చల నేపథ్యంలో ప్రభుత్వ ఏర్పాటు ఆలస్యమవుతున్నట్లుగా తెలుస్తోంది. అయితే ముఖ్యమంత్రి పదవి సీఎం ఫడ్నవీస్‌కు ఖరారైంది. ఈ నేపథ్యంలో షిండే తనయుడు డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టవచ్చని ప్రచారం సాగింది. ఈ నేపథ్యంలో ఆయన స్పందించారు.

# సీమ నేతలకు బాబు సాఫ్ట్ వార్నింగ్

విజయవాడ:ఏపీలో కూటమినేతల మధ్య విభేదాల పర్వం ప్రారంభం అయ్యింది. అందుకు రాయలసీమ వేదికగా నిలిచింది. సిమెంట్ కంపెనీలకు బూడిద తరలింపులో వివాదం ప్రకంపనలకు కారణమవుతోంది.రాయలసీమలో 'బూడిద' పంచాయితీ వివాదానికి కారణమవుతోంది.ముఖ్యంగా కూటమిలో విభేదాలకు అవకాశం కల్పిస్తోంది.ఈ తరుణంలో సీఎం చంద్రబాబు కలుగజేసుకున్నారు. దిద్దుబాటు చర్యలకు దిగనున్నారు. సిమెంట్ పరిశ్రమలకు బూడిద తరలించే విషయంలో జెసి దివాకర్ రెడ్డి, ఆదినారాయణ రెడ్డి వర్గీయుల మధ్య వివాదం తలెత్తింది. ఇప్పటివరకు జెసి వర్గీయులే బూడిద తరలిస్తుండగా.. రవాణాలో తమకు వాటా కావాలని ఆదినారాయణ రెడ్డి వర్గీయులు పట్టుపట్టారు. అప్పటినుంచి వివాదం నడుస్తోంది. ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు కలుగ చేసుకోవాల్సి



వచ్చింది. అయితే ఇది కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరుగా నిలుస్తోంది. జెసి ప్రభాకర్ రెడ్డి టిడిపిలో సీనియర్ నేత. ఆదినారాయణ రెడ్డి సైతం బిజెపి ఎమ్మెల్యే. తాజా వివాదం కూటమి ప్రభుత్వం పై ప్రభావం చూపే అవకాశం ఉంది. అందుకే టిడిపి ఇన్చార్జ్ భూపేష్ రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, జెసి ప్రభాకర్ రెడ్డిలకు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి పిలుపు వచ్చింది. సీఎం చంద్రబాబును కలుసుకోవాలని వర్తమానం అందింది. దీంతో ముఖ్యమంత్రి కార్యాలయంలో దీనిపై పంచాయితీ జరగనుంది. దీనికి చంద్రబాబు ఒక పరిష్కార మార్గం చూపి వివాదానికి ఫుల్ స్టాప్ పెట్టే అవకాశం కనిపిస్తోంది.ఆర్టీపీపీ నుంచి సిమెంట్ పరిశ్రమలకు బూడిద తరలిస్తూ ఉండేవారు. ఈ క్రమంలో చాలా ఏళ్లుగా జేసీ ప్రభాకర్ రెడ్డి వర్గీయులు ఇలా బూడిద తరలిస్తూ వచ్చారు. అయితే తమకు కూడా వాటాలు కావాలని ఆదినారాయణ రెడ్డి వర్గీయులు కోరారు. ఈ నేపథ్యంలో బూడిదను వాహనాల్లో నింపకుండా ఆదినారాయణ రెడ్డి వర్గీయులు అడ్డుకున్నారు. అదే సమయంలో ఆదినారాయణ రెడ్డి వర్గీయుల బూడిద లారీలు తాడిపత్రి రాకుండా జేసీ ప్రభాకర్ రెడ్డి అడ్డగించారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.కూటమి పార్టీల మధ్య విభేదాల పర్వం అంటూ సోషల్ మీడియాలో తెగ ప్రచారం నడిచింది. దీనిపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. దిద్దుబాటు చర్యలకు దిగారు. శాంతి భద్రతల విషయంలో రాజీ పడబోమంటూ నేతలకు హెచ్చరించారు. అందుకే ముగ్గురు నేతలకు ముఖ్యమంత్రి కార్యాలయానికి రావాలని సూచించారు. మరోవైపు ఈ వివాదం నేపథ్యంలో పోలీస్ యంత్రాంగం

అయింది. తాడిపత్రి జాతీయ రహదారిలోని కొండాపురం మండలం సుగుమంచిపల్లె చెక్ పోస్ట్ వద్ద భారీగా పోలీసులు మోహరించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ముఖ్యంగా ఈ వివాదాన్ని ఆదిలోనే తుంచేయ్యాలని చంద్రబాబు భావిస్తున్నారు. వీలైనంత త్వరగా పరిష్కార మార్గం చూపి ఎండ్ కార్డు వేయాలని చూస్తున్నారు.

# మహిళలు ఏమైనా కుందేళ్లా?

**హైదరాబాద్:** వరుసగా పిల్లలను కనడానికి మహిళలు ఏమైనా కుందేళ్లా? అని కాంగ్రెస్ సీనియర్ నేత రేణుకా చౌదరి మండిపడ్డారు. ప్రతి జంట ముగ్గురు పిల్లలను కనాలని ఆరెస్సెస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భగవత్ ఇటీవల పిలుపునిచ్చారు. దేశంలో జనాభా వృద్ధి రేటు తగ్గుదలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ మహిళా నేత రేణుకా చౌదరి తీవ్రంగా స్పందించారు. దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని, పిల్లల్ని కంటే ఉద్యోగాలు దొరికే పరిస్థితి కూడా లేదన్నారు. ఉద్యోగం లేని అబ్బాయిలకు అమ్మాయిలను ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రారన్నారు. మోహన్ భగవత్ ఎక్కువమంది పిల్లలను కనాలని చెబుతున్నాడని, కానీ అలా కనేందుకు మహిళలు కుందేళ్లు కాదన్నారు. ఈ మాటలు చెప్పేవాళ్లు ఎంతమంది పిల్లలను పెంచగలరు? అని ప్రశ్నించారు. అలా మాట్లాడేవారి అనుభవాలు ఏమిటో బాగా తెలుసని వ్యాఖ్యానించారు. దేశంలో పెరుగుతున్న ధరలపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరైనా అనారోగ్యంతో ఆసుపత్రి పాలైతే చికిత్సకయ్యే ఖర్చు భారీగా ఉంటోందన్నారు.

## మహిళా కానిస్టేబుల్ దారుణ హత్య

**హైదరాబాద్:** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో మహిళా కానిస్టేబుల్ నాగమణి హత్యకు గురయ్యారు. రాయపోలు నుంచి ఎండ్లగూడ వెళ్లే రహదారిపై ఈ ఘటన జరిగింది. హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో నాగమణి విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ఆమెకు వివాహం జరగ్గా, 10 నెలల క్రితం భర్తతో విడాకులయ్యాయి. అనంతరం నెల రోజుల క్రితం మరో వ్యక్తిని కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇది నచ్చని ఆమె సోదరుడు పకడ్బందీగా ప్లాన్ చేసి, డ్యూటీకి వెళ్తుండగా కార్‌తో ఢీ కొట్టి, వేట కొడవలితో నరికి హత్య చేశాడని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. '8 సంవత్సరాలుగా నేను నాగమణి ప్రేమించుకుంటున్నాం. మా ప్రేమ విషయం తెలిసి ఇంట్లో వాళ్లు నాగమణిని పట్టించుకోవడం మానేశారు. 2021లో ఆమెకు కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చింది. అంతకుముందు 4 సంవత్సరాలు తను హాస్టల్?లోనే ఉంది. ఆ సమయంలో నేనే ఆమెకు కావాల్సిన అవసరాలు తీర్చి చదివించాను. కానిస్టేబుల్ జాబ్ వచ్చాక తల్లిదండ్రులు ఆమెకు దగ్గరయ్యారు. నవంబర్ 10వ తేదీన యాదగిరిగుట్టలో మేం పెళ్లి చేసుకున్నాం. పెళ్లి చేసుకున్న వెంటనే మాకు ప్రాణహాని ఉందని పోలీస్ స్టేషన్?లో ఫిర్యాదు చేశాం. మేం పెళ్లి చేసుకున్నప్పటి నుంచి మమ్మల్ని చంపుతామని నాగమణి కుటుంబసభ్యులు బెదిరిస్తూ వచ్చారు. ఈరోజు అనుకున్నట్టే నా భార్యను వాళ్ల తమ్ముడు చంపేశాడు. రాయపోల్ నుంచి హయత్?నగర్ బయలుదేరే ముందు నాకు ఫోన్ చేసింది. మా తమ్ముడు నన్ను చంపేస్తున్నాడు అంటూ ఫోన్ కట్ చేసింది. వెంటనే మా అన్నయ్యకు విషయం చెప్పాను. ఆయన వెళ్లేలోపే రక్తపు మడుగులో నాగమణి కొట్టుకుంటుంది.' అని నాగమణి భర్త శ్రీకాంత్ వివరించారు.

# కేడర్ సపోర్ట్ అంతంత మాత్రమే




నెల్లూరు:వైఎస్ జగన్ సంక్రాంతి తర్వాత జిల్లాల పర్యటనకు వెళతామంటున్నారు.పార్టీ కార్యకర్తలతో జగన్ సమావేశమవ్వాలని నిర్ణయించారు. ప్రతి బుధ, గురువారాల్లో కార్యకర్తల్లో ఉండేలా ప్లాన్ చేసుకుంటున్నారు. ప్రతి రోజూ మూడు నుంచి నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించాలని నిర్ణయించారు. అలాగే ప్రతి పార్లమెంటు నియోజకవర్గాల వారీగా జగన్ సమీక్ష చేయనున్నారు. ఆయన అధికారికంగా చేసిన ప్రకటన ఇది. అంటే ఆయన జనంలో ఉండేందుకు, పార్టీని బలోపేతం చేసేందుకు తీసుకున్న నిర్ణయంగానే చూడాలి. అలాగే క్యాడర్ లో ఉత్సాహం నింపేందుకు ఆయన చేస్తున్న తొలి ప్రయత్నం ఇది అనుకోవాల్సి ఉంటుంది. ఎందుకంటే ఇప్పటి వరకూ ఆయన కార్యకర్తలను పట్టించుకోలేదన్న విమర్శలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో కార్యకర్తలతో భేటీకి జగన్ సిద్ధమవుతున్నారు. గత ఐదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు జగన్ కార్యకర్తలను పూర్తిగా పట్టించుకోకుండా వదిలేశారు. వారిని అస్సలు నేతల నుంచి జగన్ వరకూ ఎవరూ పట్టించుకోవడం లేదు. క్యాడర్ నుచూసి పురుగులును చూసి చూశారు. కనీసం వారు పడ్డ కష్టానికి సాయం చేయాలని కూడా జగన్ కానీ నేతలు కానీ ఆలోచించలేదు. పూర్తిగా తనను రెండోసారి వాలంటీర్లు అధికారంలోకి తెస్తారని భావించారు. వాలంటీర్లతో పాటు తాను అమలు చేసిన సంక్షేమ పథకాలు, బటన్ నొక్కుడు కార్యక్రమాలు తనను మరోసారి అందలం ఎక్కిస్తాయన్న భ్రమలో పడి జెండా మోసిన కార్యకర్తలను పట్టించుకోలేదు. దీంతో మొన్నటి ఎన్నికల సమయంలో కార్యకర్తలు పెద్దగా పట్టించుకోలేదు. పార్టీకి పోటీ చేసిన అభ్యర్థులకు చెందిన ముఖ్య అనుచరుల హడావిడి మాత్రమే పోలింగ్ కేంద్రాల వద్ద కనిపించింది. చొక్కాలు చించుకుని ఎవరూ ముందుకు రాలేదు. అందుకే అనేక పోలింగ్ కేంద్రాల వద్ద కూటమి పార్టీలదే పై చేయిగా మారింది. పార్టీ బలంగా ఉన్న ప్రాంతాల్లోనూ క్యాడర్ మొహం చాటేసింది. ఎన్నికల ఫలితాల తర్వాత అసలు విషయం అర్థమయింది. జగన్ కు క్యాడర్ పార్టీ గెలుపునకు ఎంత ముఖ్యమో అవగతమయింది. క్యాడర్ లేనిదే లీడర్లు లేరు. లీడర్లు లేనిదే పార్టీ లేదన్న విషయాన్ని జగన్ గుర్తించడానికి ఇన్నాళ్లు సమయం పట్టింది. అయితే ఐదేళ్లు పుణ్యకాలం గడిచిపోయిన తర్వాత, వారు ఆర్థికంగా చితికపోయిన తర్వాత కార్యకర్తల్లో తిరిగి నూతనోత్తేజం నింపాలని జగన్ చేస్తున్న ప్రయత్నాలు ఎంత మేరకు ఫలిస్తాయో ఇప్పుడే చెప్పలేం. ఎందుకంటే జగన్ ను నమ్మి బయటకు వస్తే కేసులు తమపై నమోదవుతాయన్న భయం క్యాడర్ లో ఉంటుంది. అందుకే కరడుగట్టిన వారు తప్ప సానుభూతి పరులు, జగన్ ను అభిమానించే వారు ఎవరూ అటువైపు చూడరన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఏపీ ఎన్నికలు జరిగి ఐదు నెలలు కాలేదు. ఇంకా నాలుగున్నరేళ్లు ఎన్నికలకు సమయం ఉంది. ఈ టైంలో బయటకు వచ్చి జిందాబాద్ లు కొడితే జైలు తప్పదన్నబెంగ క్యాడర్ లో ఉంటుంది. అందుకే జగన్ జిల్లా పర్యటనలకు క్యాడర్ అనుకున్న స్థాయిలో రాకపోవచ్చున్న భావన పార్టీ నేతల నుంచే వ్యక్తమవుతుంది. జగన్ ను నమ్మి, స్థానిక నేతలను విశ్వసించి జనంలోకి జెండా పట్టుకుని వస్తే కష్టాలు పడేది తామేనని వారికి తెలుసు. అందుకే మనసులో అభిమానం ఉన్నప్పటికీ ఇంత త్వరగా బయటపడి తాము ఇబ్బందులు తెచ్చుకోవడం ఎందుకన్న భావన ఖచ్చితంగా కార్యకర్తల్లో ఉంటుంది.

# పవన్ టార్గెట్ కాకినాడ...రీజనేంటీ

**విజయవాడ:**ప్రస్తుతం ఏపీలో కాకినాడ పోర్టు ఇష్యూ హాట్ టాపిక్‌గా మారింది. పవన్ కాకినాడ పర్యటన తర్వాత.. పోర్టు వ్యవహారంపై సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. కాకినాడ పోర్టు నుంచి వేల కోట్ల రూపాయల దందా జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి. పవన్ పోర్టుపై ఎందుకు ఫోకస్ పెట్టాలో మంత్రి నాదెండ్ల వివరించారు.ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కాకినాడ పర్యటనతో స్మగ్లింగ్ గుట్టు బయటపడిందని.. ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వ్యాఖ్యానించారు. దేశ భద్రతకు ముప్పు కలిగేలా స్మగ్లింగ్ కొనసాగుతోందన్నారు. గత ఐదేళ్లుగా అక్రమంగా బియ్యం రవాణా చేశారన్న మనోహర్, కూటమి ప్రభుత్వం వచ్చాక అక్రమ నిల్వలపై దాడులు చేశామని వివరించారు. కాకినాడ పోర్టులోకి ఎవరూ రాకుండా కుట్ర చేశారని.. గత ఐదేళ్లలో అక్కడ ఏం జరిగిందో ఎవరికీ తెలియదని వ్యాఖ్యానించారు.'గత ప్రభుత్వం బియ్యం డోర్ డెలివరీ అంటూ.. కొత్త పథకం మొదలుపెట్టింది. బియ్యం అక్రమ రవాణాకు తెరలేపారు. కాకినాడ పోర్టునుంచి కోటి 30లక్షల మెట్రిక్ టన్నుల..బియ్యాన్ని అక్రమంగా ఎగుమతి చేశారు. ఈ బియ్యం విలువ రూ.45 వేల కోట్లు ఉంటుంది. మాజీ సీఎం జగన్‌కు తెలియకుండా ఇది జరగదు' అని నాదెండ్ల మనోహర్ ఆరోపించారు.

1.ఎందుకు కాకినాడ పోర్ట్ పైన దృష్టి సారించాం అనేది అందరూ తెలుసుకోవాలి. గత 5 సంవత్సరాల్లో ఎవ్వరినీ పోర్టు లోపలికి అనుమతించలేదు. లోపల ఎటువంటి కార్యక్రమాలు జరుగుతున్నాయి, ఎటువంటి బోట్లు వస్తున్నాయి, అధికారులు ఎవరున్నారు, ఏ విధమైన కార్యక్రమాలు జరుగుతున్నాయి అని తెలుసుకోడానికి మీడియా వారిని కూడా అనుమతించలేదు.

2.ప్రభుత్వ ఆస్తి, మన రాష్ట్ర వనరుల్లో భాగం అయిన కాకినాడ పోర్టుకు ఎవరినీ రానీయకుండా గత ఐదేళ్లు పెద్ద కుట్ర చేశారు.

3.రాష్ట్రంలో బియ్యం సరఫరా చెయ్యడానికి 29,000 రేషన్ షాపులు ఉన్నాయి. కానీ.. వైసీపీ ప్రభుత్వం డోర్ డెలివరీ చేస్తామనే అబద్ధపు ప్రచారంతో రాష్ట్ర ఖజానాకు 1600 కోట్ల రూపాయల ఖర్చుతో 9260 వాన్లు కొని ఒక నెట్‌వర్క్ తయారు చేశారు.

4.రేషన్ దుకాణాల ద్వారా ప్రతి నెలా 1వ తారీఖు నుండి 15వ తారీఖు వరకు ఉదయం నుంచి సాయంత్రం వరకు.. వినియోగదారులు ఎప్పుడు వచ్చినా సరుకు అందించే ఒక మంచి ప్రక్రియ ఉంది. దాన్ని పక్కదారి పట్టించి స్వలాభం కోసం ఈ నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకుని బియ్యం సేకరించడం మొదలు పెట్టారు.

5.ప్రభుత్వానికి ప్రతి కిలోకి 43.40 రూపాయలు ఖర్చయ్యే ఈ బియ్యాన్ని వీళ్లు క్షేత్రస్థాయిలో 10 రూపాయలకే తీసుకున్నారు. చాలా చోట్ల సరైన సమయానికి రాలేదు కాబట్టి వ్యాను వెళ్ళిపోయిందని.. అందుకే సరుకు ఇవ్వము అని చెప్పేవారు.

6.మెడ మీద కత్తి పెట్టి ఎప్పుడైతే కాకినాడ సీ పోర్ట్స్ లిమిటెడ్ నుండి లాగేసుకుని.. వీళ్లు అరబిందోకి అప్పజెప్పారో.. ఆరోజు నుండి లెక్కలు చూస్తే ప్రతీ ఒక్కరికీ ఆశ్చర్యం కలిగుతుంది.

7.ఒక గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసుకుని చిత్తూరు, శ్రీకాకుళం నుంచి నేషనల్ హైవే మీద నేరుగా కాకినాడకు బియ్యం తరలించే పకడ్బందీ కుట్ర చేశారు. ఆంధ్ర ప్రదేశ్‌లో ఏ పోర్టులో లేని విధంగా కాకినాడ పోర్టులో బియ్యం ఎగుమతి జరిగింది.

8.గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో.. గంగవరం పోర్టు నుండి - 2,20,289 మెట్రిక్ టన్నులు, కృష్ణపట్నం పోర్టు నుండి - 23,51,218 మెట్రిక్ టన్నులు, విశాఖపట్నం పోర్టు నుండి - 38,02,000 మెట్రిక్ టన్నుల ఎగుమతి జరిగింది.

9.కాకినాడ లెక్కలు చెప్తే ఆశ్చర్యం వేస్తుంది. కాకినాడ పోర్టులో వీళ్లు దుర్మార్గంగా ఈ మూడు సంవత్సరాల నుండి ఎగుమతి చేసింది 1,31,18,346 మెట్రిక్ టన్నులు. ఒక్క కాకినాడలో జరిగిన దీని విలువ 48,537 కోట్ల రూపాయలు.

10.ప్రజలకు సంబంధించిన ఆస్తిని పూర్తి స్థాయిలో కుట్ర చేసి దోచుకు తింటుంటే.. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కాకినాడకు రావాల్సి వచ్చింది.

11.ఇదేమి ఒక వ్యక్తిపై కక్ష కట్టినట్టు కాదు. గత పాలనలో ముఖ్యమంత్రి జగన్‌కు తెలియకుండా జరగదు కదా ఈ దోపిడీ? అరబిందో రియాల్టీకి కాకినాడ సీపోర్ట్స్ ఎందుకు 41% వాటా ట్రాన్స్‌ఫర్ చేసింది? ఏ సందర్భంలో చేసింది? భారతదేశంలో కార్పొరేట్ చరిత్రలో ఏనాడు జరగని విధంగా కేవీ రావు, వారి కుటుంబాన్ని బెదిరించి ఏ విధంగా వీళ్లు 41 శాతం వాటా రాయించుకున్నారో కచ్చితంగా బయటకు రావాలి.

వేగుచుక్క

# కేసీఆర్ మొక్క కాదు "వేగుచుక్క".





**వేగుచుక్క న్యూస్, హైదరాబాద్, డిసెంబర్ 2:** కేసీఆర్‌ను మొక్క అంటూ సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానిస్తున్నారని, కేసీఆర్ మొక్క కాదని వేగుచుక్క అని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. సోమవారం తన నివాసంలో కోరుట్ల నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై కేసులు పెట్టి వేధిస్తే ఊరుకునేది లేదన్నారు. కేసీఆర్ పాలనలో నిధులు వరదల్లా పారేవని, ప్రస్తుతం తిట్లే పారుతున్నాయని వ్యాఖ్యానించారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేనేతపై జీఎస్టీని రీయింబర్స్‌మెంట్ చేస్తామని రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుత రేవంత్ సర్కారు దానిని విస్మరించిందన్నారు. వెంటనే రీయింబర్స్‌మెంట్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

**4 నుంచి జాగృతి సమావేశాలు.**

తెలంగాణ జాగృతి సమీక్ష సమావేశాలు ఈనెల 4వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట కవిత సమావేశాలకు అధ్యక్షత వహించనున్నారు. డిసెంబర్ 4వ తేదీన వరంగల్, నిజామాబాద్, 5న కరీంనగర్, నల్గొండ, 6న రంగారెడ్డి, ఆదిలాబాద్, 7న హైదరాబాద్, ఖమ్మం, 8న మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల నేతలతో సమీక్షలు నిర్వహించనున్నారు.

## సై అంటే సై అంటున్న టీపీసీసీ బాస్




హైదరాబాద్: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చేపట్టిన సంక్షేమ పథకాలను మరచి, తెలంగాణ బీజేపీ చార్జిషీట్ ప్రకటించిందని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. హైదరాబాద్ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. తమ ఏడాది కాలం పాలనపై, అలాగే కేంద్రంలో బీజేపీ పదేళ్ల పాలనపై తాము చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఏడాది కాలవ్యవధిలోనే రాష్ట్ర అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత తెలంగాణ కాంగ్రెస్ సర్కార్ కు దక్కుతుందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ దేశ వ్యాప్తంగా చీకటి పాలన సాగిస్తుందని, తాము చేసే సవాళ్లు స్వీకరించే సత్తా బీజేపీ నేతలకు ఉందా అంటూ మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు నల్లధనాన్ని తీసుకువచ్చి ప్రతి అకౌంట్ కు రూ.15 లక్షల రూపాయలు జమ చేస్తామని హామీ ఇచ్చారని, అంతే కాకుండా 100 రోజుల్లో అన్ని రకాల ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చి, నేడు ఆ హామీలను తుంగలో తొక్కిన ఘనత బీజేపీకే దక్కుతుందని తెలిపారు. దేశంలో 411 మంది ఎమ్మెల్యేలను వివిధ పార్టీల నుండి బీజేపీలోకి మార్చారని, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీని ఉద్దేశించి చేరికలపై మాట్లాడే అర్హత బీజేపీకి లేదన్నారు. మతతత్వ రాజకీయాలు చేస్తూ పార్టీలను చీలిస్తూ రాజకీయ పబ్బం గడుపుతున్న బీజేపీ సుద్దపూస మాటలు మాట్లాడుతుందని ఎద్దేవా చేశారు. ఏడాదిలో తాము ఏమి చేసామో చెప్పేందుకు తాము సిద్ధమని, కానీ 11 ఏళ్లలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఏమి చేసిందో చెప్పేందుకు బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ కిషన్ రెడ్డికి సవాల్ విసిరారు. తెలంగాణలో బీజేపీ పూర్తిగా ప్రజల విశ్వాసాన్ని కోల్పోవడంతో కొత్తగా చార్జిషీట్ అంటూ బీజేపీ కొత్త రాజకీయాలకు తెర తీసిందని ఆయన విమర్శించారు. తెలంగాణలో బీఆర్ఎస్ తో బీజేపీ అంట కాగుతుండడంతో స్వయాన ప్రధాని మోడీ చివాట్లు పెట్టడంతో తెలంగాణ బిజెపి నేతలకు అర్థం కాని పరిస్థితి ఉందని, అందుకే వారు చార్జిషీట్ అంటూ హడావుడి చేస్తున్నారన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ కవల పిల్లలని ఎన్నోసార్లు అది రుజువైందన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ తో మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకున్న మాట వాస్తవం కాదా అంటూ కిషన్ రెడ్డిని మహేష్ గౌడ్ ప్రశ్నించారు. 2014 నుండి 24 వరకు పెట్రోల్, డీజిల్ గ్యాస్ ధరలు ఎన్నిసార్లు పెంచారో చెప్పాలని, లేకుంటే ప్రజల ముందే చర్చకు తాను సిద్ధమంటూ మహేష్ గౌడ్ మరోమారు సీరియస్ కామెంట్స్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో అధికారంలోకి రాగానే పెండింగ్ ఉద్యోగాలను భర్తీ చేసిందని, గృహజ్యోతి రుణమాఫీ, మహిళలకు ఫ్రీ బస్సు ఇలాంటి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టినా కూడా బీజేపీ నేతలకు కనిపించని పరిస్థితి ఉందన్నారు.

## ఐసీసీ ఛీఫ్ గా జైషా...



ముంబై: క్రికెట్ ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన నియంత్రణ మండలి ఐసీసీకి భారత్ కు చెందిన జై షా చైర్మన్ గా ఆదివారం నుంచి పగ్గాలు చేపట్టబోతున్నారు. 2019 నుంచి భారత క్రికెట్ నియంత్రణ బోర్డు కార్యదర్శిగా పని చేస్తున్న జై షా.. ఐసీసీ పదవికి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. దీంతో డిసెంబర్ 1 నుంచి ఈ పదవి చేపట్టనున్నారు. ఐసీసీలో డిసెంబర్ 1 నుంచి చైర్మన్ గా జై షా శకం మొదలైంది. చైర్మన్ గా పగ్గాలు చేపట్టిన జై షా ముందు కొన్ని సవాళ్లు ఉన్నాయి. ముఖ్యంగా 2028లో అమెరికాలోని లాస్ ఏంజెలిస్ లో జరిగే ఒలింపిక్స్ లో క్రికెట్ ను చేర్చడంపై కార్యచరణ రూపొందించాల్సి ఉంటుంది. అలాగే మహిళా క్రికెట్ ను మరింత ముందుకు తీసుకుపోవాల్సిన అవశ్యకత కూడా ఉంది. మరోవైపు చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన జై షా మాట్లాడుతూ.. ఈ పదవికి ఎన్నుకోవడం గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఐసీసీ డైరెక్టర్లు, వివిధ బోర్డు మెంబర్లకు ఆయన థాంక్స్ తెలిపారు. రాబోయే ఒలింపిక్స్ లో క్రికెట్ ను నిర్వహించడంపై ఇంకా చాలా చేయాల్సి ఉందని పేర్కొన్నారు. అలాగే ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులకు మరింత మజా పంచే విధంగా గేమ్ ను తీర్చదిద్దడానికి ప్రయత్నిస్తానని తెలిపారు. టెస్టు, వన్డే, టీ20 లాంటి మల్టిపుల్ ఫార్మాట్లు ఉండటంతో ప్రస్తుతం క్రికెట్ కీలకమైన దశలో ఉందని, అలాగే మహిళా క్రికెట్ ను మరింత డెవలప్ చేయాల్సిన అవసరముందని జై షా పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తగా ఆట విస్తరించేందుకు చాలా అవకాశాలున్నాయని, నూతన అవకాశాలను అందిపుచ్చుకుని గేమ్ మరింత విస్తరించేందుకుగాను బోర్డులు, అసోసియేట్ దేశాల సహకారాన్ని తీసుకుంటానని వెల్లడించారు. గుజరాత్ క్రికెట్ అసోసియేషన్ లో 2009లో జై షా తన జర్నీని ప్రారంభించి అంచెలంచెలుగా ఎదిగారు. ముఖ్యంగా జై షా పాలన కాలంలోనే అహ్మదాబాద్ లో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియం (నరేంద్ర మోదీ స్టేడియం)ను నిర్మించారు. ఇక, 2019లో బీసీసీఐలో కార్యదర్శిగా జై షా కాలు పెట్టారు. అక్కడినుంచి ప్రస్తుతం శక్తివంతమైన ఐసీసీ చైర్మన్ లెవల్ కి ఎదిగారు. జై షాకు ముందు ఐసీసీ చైర్మన్ గా 2020 నుంచి గ్రెగ్ బార్క్లే వ్యవహరించారు. రెండుసార్లు ఈ పదవిని చేపట్టిన బార్ క్లే.. మూడోసారి సంసిద్ధంగా లేకపోవడంతో జై షా రేసులోకి వచ్చారు.

## తెలంగాణలో తగ్గిన నిరుద్యోగం...



హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి ప్రజలు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని కోరుకున్నదే నీళ్లు, నిధులు, నియామకాల కోసం. ఉమ్మడి రాష్ట్రంలో నీళ్లు, నిధులతో పాటు నియామకాల్లో అన్యాయం జరుగుతోందని నిరుద్యోగులు ఆందోళన చెందేవారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే ఉద్యోగాలు వస్తాయని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఈ క్రమంలో ఎన్నో ఉద్యమాలు, ప్రాణత్యాగాలు చేసి తెలంగాణను సాధించుకున్నారు. 2014లో సోనియా గాంధీ ప్రత్యేక తెలంగాణకు అనుమతి ఇవ్వగా? ఉద్యమ పార్టీగా టిఆర్ఎస్ ఇప్పటి బీఆర్ఎస్ భారీ మెజార్టీతో అధికారంలోకి వచ్చింది. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఇంటికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీని తుంగలో తొక్కడమే కాకుండా తాను ఆ మాటే అనలేదని ఇంటికో ఉద్యోగం అసలు సాధ్యమయ్యే ముచ్చట కాదని మాట మార్చారు. కేసీఆర్ మాటలతో నిరుద్యోగుల ఆశలన్నీ ఆవిరైపోయాయి. 2014 నుండి 2018 వరకు ఉద్యోగ నియామకాల కోసం వేచి చూసి నిరుద్యోగులు నిరాశ చెందారు. అయినప్పటికీ 2018లో మరోసారి టీఆర్ఎస్ కు అధికారమిచ్చి ఉద్యోగాల కోసం ఎదురుచూశారు. అయినప్పటికీ ప్రభుత్వం తీరులో మార్పు రాలేదు. పదేళ్లలో ఒక్కసారి కూడా గ్రూప్-1 పరీక్షను నిర్వహించకుండా అసమర్ద పాలనతో బీఆర్ఎస్ చరిత్రలో నిలిచిపోయింది. పక్క రాష్ట్రాల్లో మూడు నాలుగు డీఎస్సీలు నిర్వహిస్తే తెలంగాణలో కేవలం ఒకే ఒక్క డీఎస్సీ నిర్వహించారు. మరోవైపు పేపర్ లీకేజీలు నిరుద్యోగులను తీవ్ర ఆగ్రహానికి, ఆందోళనకు గురి చేశాయి. ఈ క్రమంలో బీఆర్ఎస్ ను గద్దె దింపాలని నిరుద్యోగులు నిర్ణయించుకున్నారు. తన కుటుంబంలోని వ్యక్తులందరికీ ఉద్యోగాలు ఇచ్చిన కేసీఆర్ నిరుద్యోగులను పట్టించుకోకపోవడంతో మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో గద్దె దింపి తమ అసహనాన్ని వ్యక్తం చేశారు. అదే సమయంలో జాబ్ క్యాలెండర్, ఉద్యోగ నోటిఫికేషన్ల పేరుతో కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు హామీలు ఇచ్చింది. దీంతో నిరుద్యోగులు కాంగ్రెస్ పార్టీకే పట్టం కట్టారు. ఎన్నికల్లో ముందుండి నడిపించి కాంగ్రెస్ పార్టీని విజయతీరానికి చేర్చారు. అధికారంలో వచ్చిన ఏడాదిలోనే కాంగ్రెస్ పార్టీ ఉద్యోగ నియామకాలు చేపట్టడంతో పాటు, గత ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలకు ఎలాంటి అవకతవకలు జరగకుండా వీలైనంత త్వరగా జాయినింగ్ లెటర్లు ఇచ్చింది. మరోవైపు ప్రైవేట్ సెక్టార్ లోను ఉద్యోగ అవకాశాలు పెంచుతోంది. తాజాగా వచ్చిన ఓ నివేదిక ప్రకారం ఆరు నెలలోనే రాష్ట్రంలో నిరుద్యోగం తగ్గుముఖం పట్టింది. చదువుకుంటున్న 15 నుండి 29 ఏళ్ల యువతలో నిరుద్యోగం తగ్గుముఖం పట్టినట్టు నివేదిక చెబుతోంది. గత ఏడాది జూలై సెప్టెంబర్ తో పోలిస్తే నిరుద్యోగ రేటు 22. 9శాతం నుండి 18.1 శాతానికి తగ్గినట్టు జాతీయ కార్మిక బలగం త్రైమాసిక నివేదికలో వెల్లడైంది. ఆరు నెలలుగా ఉద్యోగ అవకాశాలు పెరగడంతో యువతకు ఉపాధికి లభిస్తోందని నివేదిక పేర్కొంది. అన్ని వయసుల వారిని పరిగణంలోకి తీసుకుంటే ఉద్యోగ రేటు 6.6% ఉందని నివేదిక పేర్కొంది. దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే సగటు నిరుద్యోగ రేటులో కేరళ 10.1%తో ముందు వరుసలో ఉండగా.. ఆంధ్రప్రదేశ్ 7.3%తో రెండో స్థానంలో ఉంది. ఇక తెలంగాణ 10వ స్థానంలో ఉంది. ప్రజాప్రభుత్వం సరైన నిర్ణయాలు తీసుకుంటూ ఇదే విధంగా పాలనకొనసాగిస్తే వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలో నిరుద్యోగం మరింత తగ్గే అవకాశాలు ఉన్నాయి. దీంతో నిరుద్యోగుల ఆకాంక్షలు నెరవేరే అవకాశం ఉంది.

## ఓరుగల్లు కమలంలో కలహాలు...

వరంగల్: బీజేపీలో ఆసక్తికర పరిణా మాలు చోటు చేసుకుంటున్నాయి. పార్టీలోని నేతల మధ్య అంతర్గత



విభేదాలు బయటపడుతున్నాయి. జిల్లా అధ్యక్షురాలు లేకుండానే మిగతా నేతలు కలిసి కాజీపేట్ రైల్వే కోచ్ పై సంబరాల కార్యక్రమం చేపట్టారు. ఈ మొత్తం వ్యవహారంపై అధినాయకత్వానికి కూడా ఫిర్యాదు అందినట్లు తెలిసింది. ఓరుగల్లు బీజేపీలో కొద్దిరోజులుగా కోల్డ్ వార్ నడుస్తోంది. పార్టీ జిల్లా అధ్యక్షురాలికి, ఇతర నేతలకు మధ్య అంతర్గ విభేదాల కారణంగా సయోధ్య కుదరడం లేదని తెలుస్తోంది. ఇందులో మాజీ ఎమ్మెల్యేలతో పాటు ఎలక్షన్స్ టైమ్ లో పార్టీ చేరిన నేతలంతా ఒక వైపుంటే.. పార్టీ జిల్లా అధ్యక్షురాలు మరో వైపున్నట్లు స్పష్టమవుతోంది. కాజీపేటలోని వ్యాగన్ మ్యానుఫ్యాక్షరింగ్ యూనిట్ ను కోచ్ ఫ్యాక్టరీ గా అప్ గ్రేడ్ చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోగా.. సంబరాలు జరుపుకునే సందర్భంలోనే ఈ విషయం బయటపడింది. కొద్దిరోజుల్లోనే పంచాయతీ ఎలక్షన్స్ జరగనున్న తరుణంలో ఓరుగల్లు బీజేపీ నేతల తీరుపై చర్చ జరుగుతోంది. ఓ వైపు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, ఫీల్డ్ లో బలమైన క్యాడర్ ను కలిగి ఉన్న బీఆర్ఎస్ కు పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ పోటీ

ఇవ్వగలదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలిగా ప్రస్తుతం రావు పద్మారెడ్డి కొనసాగుతున్నారు. కొంతకాలంగా పార్టీని బలోపేతం చేస్తూ క్యాడర్ ను కాపాడుకునే ప్రయత్నం చేయడమే కాకుండా.. గత ప్రభుత్వ హయాంలో ఏ సందర్భం వచ్చినా నిరసనలు, ఆందోళనలతో పార్టీని జిల్లాలో యాక్టీవ్ చేశారు. దీంతో గత గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 10 కార్పొరేటర్ స్థానాలు గెలవడంలో కీలక పాత్ర పోషించారు. ఇంతవరకు బాగానే ఉండగా.. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో రావు పద్మారెడ్డి వరంగల్ వెస్ట్ నియోజకవర్గంలో బీజేపీ నుంచి పోటీ చేసి ఓటమి చవి చూశారు. వరంగల్ వెస్ట్ నియోజకవర్గం జనరల్ స్థానం కాగా.. ఆ టికెట్ కోసం రావు పద్మారెడ్డితో పాటు మార్తినేని ధర్మారావు, చాడ శ్రీనివాస్ రెడ్డి, మరికొందరు నేతలు పోటీ పడ్డారు.

వేగుచుక్క

# కదులుతున్న కారులో మంటలు.

## - రహదారిపైనే దగ్ధం.



**వేగుచుక్క న్యూస్, జుక్కల్ డిసెంబర్ 2:**

మద్నూర్ మండలం మేనూర్ వద్ద 161 జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై సోమవారం కారు దగ్ధమైంది. ఐదుగురు కలిసి కారులో మారేపల్లి నుంచి సిర్పూర్‌కు వెళ్తున్న క్రమంలో మేనూర్ వద్ద ఒక్కసారిగా కారులో మంటలు చెలరేగాయి. వెంటనే వారు కారు నుంచి దిగిపోగా.. క్షణాల్లోనే కారు పూర్తిగా దగ్ధమైంది. అనంతరం అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. పోలీసులు విచారణ చేపట్టారు.

# కాంగ్రెస్ ప్రభుత్వానివి ఆరు అబద్ధాలు.. 66 మోసాలు'.

## - బీజేపీ చార్జిషీట్ విడుదల.



**వేగుచుక్క న్యూస్,కామారెడ్డి, డిసెంబర్ 2**

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానివి ఆరు అబద్ధాలు, 66 మోసాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర శాఖ పిలుపు మేరకు బీజేపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఛార్జిషీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా అరుణతార మాట్లాడుతూ.. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ఎటు పోయిందని ప్రశ్నించారు. మహిళలకు ఇస్తామన్న రూ. 2,500, చదువుకున్న విద్యార్థులకు స్కూటీ, కళ్యాణలక్ష్మి కింద తులం బంగారం ఏమయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణ రెడ్డి, సీనియర్ నాయకులు మురళీధర్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాణాల లక్ష్మారెడ్డి, నీలం చిన్న రాజులు, రంజిత్ మోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శులు నరేందర్ రెడ్డి, రవీందర్ రావు తదితరులున్నారు.

# టెట్ అభ్యర్థులకు ఉచిత కోచింగ్.

## - పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి.





**వేగుచుక్క న్యూస్, కరీంనగర్, డిసెంబర్ 2:**

విఎస్ఆర్ క్లాసెస్ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న టెట్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ తరగతులను టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్ లో అల్ఫోర్స్ విద్యా సంస్థ ఆధ్వర్యంలో ఐఐటి నీటిలో శిక్షణ ఇచ్చిన మాదిరిగానే టెట్ అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన క్యాంప్ ఆఫీస్ లో సోమవారం టెట్ శిక్షణకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఇప్పటికే పలు నియోజకవర్గాల పర్యటించిన క్రమంలో నిరుద్యోగులకు ఉచితంగా అందుబాటులో ఆల్ ఫోర్స్ ఈ క్లాస్ యాప్ ను అందజేయగా, అందులో ఇప్పటికే 50000 మంది అభ్యర్థులు రిజిస్టర్ చేసుకున్నట్లు తెలిపారు. అందులో 56 కాంపిటీటివ్ ఎగ్జామ్స్ సంబంధించిన స్టడీ మెటీరియల్ ఉంచినట్లు ఆయన వివరించారు. అలాగే కరీంనగర్ చెందిన యువత కోసం టెట్ అభ్యర్థులకు ఉపయోగపడేలా వీఎస్సార్ క్లాసెస్ పేరుతో తరగతులు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్ లో తరగతులు ఉంటాయన్నారు. అభ్యర్థులు డిసెంబర్ 3, 4 తేదీలలో ఆన్లైన్లో రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులను ఎంపిక చేసి తరగతులు నిర్వహిస్తామని ఆయన వివరించారు. హైదరాబాదు నుంచి సీనియర్ ఫ్యాకల్టీ తో తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. ఇందుకు సహకరించిన కిడ్స్ ట్యుటోరియల్ నిర్వాహకులు, సత్యం టీచర్స్ అకాడమీ నిర్వాహకుడు చందు లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ తరగతులు ఉదయం 9 గంటల నుంచి ఐదు గంటల వరకు ఉంటాయని, అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9908421285, 8985557444 సంప్రదించాలని అన్నారు.

# రైల్వే అభివృద్ధికి అదనంగా రూ" వెయ్యి కోట్లు.

## - ఎంపీ అరవింద్ ప్రశ్నకు కేంద్ర మంత్రి వెల్లడి.

**వేగుచుక్క న్యూస్, డిసెంబర్ 2:**



తెలంగాణలో రైల్వే అభివృద్ధికి అదనంగా రూ.వెయ్యి కోట్లు మంజూరు చేసినట్లు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. పార్లమెంట్‌లో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధికి బడ్జెట్‌లో 20శాతం కేటాయింపులు పెంచామని పేర్కొన్నారు. ఇది సుమారు రూ.వెయ్యి కోట్లు ఉంటుందన్నారు. ప్రధాని మోదీ హయాంలో గత దశాబ్దకాలంలో 650 కిలోమీటర్ల రైల్వే పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో 2009 నుంచి 2014 వరకు కేవలం 87 కిలోమీటర్ల మేర మాత్రమే రైల్వే లైన్ల పనులు జరిగాయని వివరించారు. కాంగ్రెస్ పాలనతో పోలిస్తే.. బీజేపీ ప్రభుత్వ పాలనలో 647 శాతం పెరిగిందని చెప్పారు.

# అట్టహాసంగా ఆరోగ్య ఉత్సవాలు.




- •నర్సింగ్ కళాశాలలు, మైత్రి ట్రాన్స్ క్లినిక్ లను వర్చువల్ ద్వారా ప్రారంభించిన సీ.ఎం.
- •పాల్గొన్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, డిసెంబర్ 2 :**

రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రభుత్వం అట్టహాసంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన - ప్రజా విజయోత్సవాల్లో భాగంగా సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆరోగ్య ఉత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. బోధన్ శాసన సభ్యులు పి.సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు హాజరవగా, ఆయా జిల్లాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలను, మైత్రి ట్రాన్స్ క్లినిక్ లను హైదరాబాద్ నుండి మంత్రులు దామోదర రాజనరసింహ, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, వేంనరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే దానం నాగేందర్, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తూ తదితరులతో కలిసి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారు. స్థానికంగా నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు జ్యోతి ప్రజ్వలన చేసి ఆరోగ్య ఉత్సవాల కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభోత్సవం చేశారు. నూతనంగా నియామకం చేసిన 442 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్లకు, 24 మంది ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లకు సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. రాష్ట్రాన్ని ఆరోగ్యవంతమైన తెలంగాణ సమాజంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో వైద్య రంగానికి ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఇందులో భాగంగానే 7800 మంది నర్సింగ్ ఆఫీసర్లను ఇప్పటికే నియమించగా, తాజాగా అసిస్టెంట్ సర్జన్ ల ఖాళీలను భర్తీ చేశామన్నారు. త్వరలోనే వైద్యారోగ్య శాఖలో మరో 6496 ఖాళీలు భర్తీ కానున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. వైద్యారోగ్య శాఖ అధికారులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



# పంచాయితీ కార్మికులపై వేధింపులు ఆపాలి.

## - సిఐటీయు డిమాండ్.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, డిసెంబర్ 2:**

జిల్లాలో గ్రామపంచాయితీ కార్మికులపై అధికారుల వేధింపులు అధికంగా పెరిగాయని తెలంగాణ గ్రామపంచాయితీ ఎంప్లాయీస్ మరియు వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జంగం గంగాధర్ ఆవేదన వ్యక్తం చేసినారు. అధిక పనిభారం, అధిక సమయం పనికి వెచ్చించడం, కార్మికుల కుటుంబాలలో ఏదైనా మంచి చెడులు జరిగితే సెలవులు ఇవ్వకపోవడం, హాజరు పట్టికలలో తక్కువగా హాజరైనట్లు చూపించి, ఇచ్చే కొద్దిపాటి వేతనాలలో కోతలు విధించటం వంటి అనేక వేధింపులకు గురి చేస్తున్నారని అన్నారు. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని గ్రామ అభివృద్ధి కోసం పని చేస్తున్న కార్మికుల పైన ఈ రకంగా వేధించటం సరైంది కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇలాంటి వేధింపులు మానుకోక పోతే తగిన పోరాటాలకు కార్మికులు సిద్ధపడాల్సిన పరిస్థితి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఇచ్చే కొద్దిపాటి వేతనాలు కూడా ఐదు నెలల పైగా ఇవ్వటం లేదని ఇలాంటి పరిస్థితులలో ఏం తిని తమ కుటుంబాలు బ్రతకాలని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు కింది స్థాయి కార్మికుల పట్ల సానుభూతితో వ్యవహరించి, కార్మికులతో పనులు చేయించుకోవాలి తప్ప, ఇబ్బందులకు గురిచేస్తే సిఐటీయు సంఘం కార్మికులతో తగిన పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. సిఐటీయు సంఘం నిర్వంచే పోరాటాలకు అన్ని వర్గాల నుండి సహకారం అందించాలని కోరారు.

# 2025 యుగాంతానికి ఎంట్రీ పాయింటా

రాబోయేదంతా వినాశనమేనా..? మనుషులంతా నశించి పోతారా..? భూమి మనుగడ ఇక కష్టమైనా..? ఇప్పటి వరకూ ఊహిస్తున్న డూమ్స్ డేకు రోజులు దగ్గర పడ్డాయా..? మరో నెల రోజుల్లో కళ్లముందుకొస్తున్న కొత్త సంవత్సరమే మన అంతానికి ఎంట్రీ పాయింటా..? ప్రపంచమంతా నమ్ముతున్న ఓ జోస్యాన్ని వింటుంటే ఈ భయాలన్నీ నిజమేనని నమ్మాల్సి వస్తుంది. రాబోయే విలయం గురించి ప్రపంచ ప్రఖ్యాత భవిష్యవాణి బాబా వంగా షాకింగ్ జోస్యం చెప్పింది. ఆమె చెప్పిన మాటలు తేలికగా కొట్టి పారేయలేం. ఎందుకంటే, 50 ఏళ్ల క్రితమే భవిష్యత్తును ఊహించిన బాబా వంగ చెప్పిన చాలా విషయాలు ఇప్పటికే నిజమై కనిపించాయి. రాబోయే కాలం గురించి ఆమె చెప్పిన మాటలు ఇప్పుడు ప్రపంచాన్ని కలవరానికి గురిచేస్తోంది. 2025 ఘోర కలిని చూపిస్తుందనే కంగారు పుడుతోంది. ప్రస్తుతం పెద్దగా కనిపించని కమ్యూనిజం భవిష్యత్తులో ప్రపంచాన్ని ఏలుతుందనే జోస్యం నుండి యూరప్‌లో యుద్ధాలు.. తెల్లవాళ్లకు ముస్లీం రాజుగా మారడం.. భూమి బద్దలై పోవడం వంటి భారీ షాక్ ఇచ్చే అంశాలు ఆమె ప్రిడిక్షన్‌లో ఉన్నాయి. 2025లో యూరప్‌లో భయంకరైన యుద్ధం జరుగుతుందనీ.. ఇది చాలా విధ్వంసానికి కారణం అవుతుందనీ.. ప్రపంచ నాశనానికి ఇదే మొదలని బాబా వంగా జోస్యం చెప్పారు.బాబా వంగ బతికున్న కాలంలో ఓ ఇంటర్వ్యూలో రష్యా అధ్యక్షుడు పుతిన్ గురించి చెప్పింది. అలాగే, కమ్యూనిజం ప్రపంచాన్ని ఏలుతుందని అంచనా వేసింది. దీన్ని బట్టి, పుతిన్ నాయకత్వంలో కమ్యూనిజం ప్రపంచ ఆధిపత్య శక్తిగా అవతరిస్తుందని తెలుస్తుంది. ఆమె జోస్యం ప్రకారం, 2043 కల్లా ప్రపంచమంతా కమ్యూనిజం చేతుల్లోకి వెళ్తుంది. ఇది 2025లోనే ప్రారంభం అవుతుంది. దీనికి 2025లో జరిగే అత్యంత భయంకరమైన యుద్ధం కారణం అవుతుందని కూడా బాబా వంగా అంచనా వేసింది. 2025లో యూరప్‌లో ఘోరమైన యుద్ధం జరుగుతుందనీ.. ఇది ప్రపంచ యుద్ధానికి దారి తీస్తుందనీ? భారీ స్థాయిలో ధన, ప్రాణ నష్టం వాటిల్లుతుందని ఆమె ఊహించింది.ఈ జోస్యంలో నిజం ఎంతనేది అటుంచితే? ప్రస్తుత పరిస్థితులను బట్టి.. కమ్యూనిస్ట్ దేశాలైన రష్యా, చైనాలకు అమెరికాకు మధ్య ఆధిపత్య పోరు పీక్స్‌లో ఉంది. ఇటీవల పుతిన్ చేస్తున్న ప్రకటనలు చూస్తుంటే.. పాశ్చాత్య దేశాలు ఉక్రెయిన్‌కు ఇచ్చిన ఆయుధాలు రష్యా లోపల ప్రయోగిస్తే అది భయానక యుద్ధానికి దారి తీస్తుందనే సూచనలు ఉన్నాయ్. దానికి నాటో దేశాలు, అమెరికా, యూరప్ కంట్రీలు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని కూడా పుతిన్ గట్టి వార్నింగ్ ఇచ్చారు. తాజాగా, ఓ16 మాజీ చీఫ్ రిచర్డ్ డీర్లవ్ కూడా దీనిపై యూకే పీఎంకు సూచనలు చేశారు. పుతిన్ యూకేపై యుద్ధానికి దిగుతారని హెచ్చరించారు.ఇక, ఐరోపాలో యుద్ధం గురించి బాబా వంగ అంచనాతో పాటు, 2043 నాటికి యూరప్ ముస్లింల పాలనలోకి వస్తుందని.. 2076 నాటికి ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిజం తిరిగి వస్తుందని అంచనా వేశారు. అంటే, కమ్యూనిస్ట్ కంట్రీలుగా ఉన్న రష్యా, చైనాలు ప్రపంచాన్ని ఏలతాయనే అనుమానాలకు ఇది బలం చేకూరుస్తుంది.

బాబా వంగ, 2025లో ఐరోపాలో క్రూరమైన యుద్ధాలు జరుగుతాయని హెచ్చరించింది. ఇదే విషయాన్ని, నోస్ట్రడమస్‌గా పాపులర్ అయిన, 16వ శతాబ్దానికి చెందిన మిచెల్ డి నోస్ట్రెడామ్ కూడా చెప్పాడు. ఐరోపా భూభాగాలు క్రూరమైన యుద్ధాల్లో పాల్గొంటాయని హెచ్చరించాడు .భారీ విధ్వంసం, భారీ ప్రాణ, ఆస్తి నష్టాన్ని కలిగిస్తుందని అంచనా వేశాడు. అయితే, పుతిన్ ప్రారంభించిన ఉక్రెయిన్ యుద్ధం ఈ అంచనాలను నిజం చేస్తున్నట్లు కొందరు వ్యాఖ్యానిస్తున్నారు.

# వారసత్వ వీఆర్ఏలకు అపాయింట్ చేయాలి.

## - సిఐటియు జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, డిసెంబర్ 2:**






వారసత్వ వీఆర్ఏలకు అపాయింట్ చేయాలనీ సిఐటియు జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద వీఆర్ఏలు ధర్నా కార్యక్రమం చేపట్టారు. జరిగింది. ఈ ధర్నాకు సిఐటియు జిల్లా కన్వీనర్ కే చంద్రశేఖర్ మద్దతు తెలుపుతూ మాట్లాడారు. వీఆర్ఏల వారసులకు జీవో నెంబర్ 81 ప్రకారం 61 సంవత్సరాలు నిండిన వారి పిల్లలకు వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వీఆర్ఏలకు అనేక అనేక ఇబ్బందులు ఉన్నాయని, ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యోగాలు కల్పించి వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక ప్రభుత్వంగా కాకుండా కార్మిక కర్షక రైతు ప్రభుత్వం గా ఉండాలని మేము కోరుకుంటున్నాం అన్నారు. కార్మికుల సమస్యలను పక్కనపెట్టి ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తే గత ప్రభుత్వాలకు పట్టిన గతే ఈ ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏల సంఘంజిల్లా అధ్యక్షుడు జాదవ్ దేవయ్య, అశోక్, పండరి, రాజేందర్, హనుమాన్లు, వేణు, ఉదయ్, శివ శంకర్, భూమయ్య, రాములు పాల్గొన్నారు.